


# అమృత హస్తాలు

జి. భాను

**కాటితోపులోనుండి** నవ్వుతున్నట్లుగా పైకి వచ్చిన సూర్యుడు బారెడు పొద్దెక్కేటప్పటికి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఏ అదృశ్య శక్తినో గాలి హోరుమని పిలుస్తున్నది. కాలవ గట్టు పైన ఈతచెట్లు మట్టలు వంగి లేస్తూ నమస్కారాలు చేస్తున్నట్టున్నాయి.

శివయ్య కాలవ గట్టు దిగి, డొంక దారిని పడి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చేటప్పుడేఅతని తలలోఎన్నోఆలోచనలు కిందాపైనా పడుతున్నాయి. చెప్పరాని ఆనందం ఒకవైపు, తప్పు చేశానేమో అనే భావం ఒకవైపు అతని మనస్సును చిలుకుతున్నాయి. అయినా ఒకానొక ద్వైదీ భావంతో ఇంటికి వచ్చాడు.

ఇంటి దగ్గర కుమారస్వామి స్నేహితులు తన కోసమే కాచుకుని కూర్చున్నారు. తమ నేస్తం వస్తున్నాడనే ఉప్పు ఎప్పు డందిందో అందరూ వచ్చారు భోగట్టా కోసం. వచ్చిన వాళ్ళలో కొంత మంది విద్యార్థులు, కొందరు చదువు మానేసి ఏవో ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళు. మస్తాన్ మాస్టారు చెప్పి ఉంటాడు వాళ్ళకి. అయినా ఖచ్చితంగా కనుక్కోవడానికి వచ్చారన్న మాట అనుకుంటూ శివయ్య ఇంట్లోకి వచ్చాడు. అరుగు మీదున్న అందర్నీ కలియజూశాడు. అందరూ తన్ను గౌరవంగా చూస్తున్నారు.

‘‘మరండీ! స్వామి పరీక్షలు అయిపోయి వస్తున్నాడని మీకు వచ్చిన ఉత్తరం చదివిన మస్తాన్ మాస్టారు గారు అన్నారట. రాత్రి వాసుతో చెపితే వాడు మా అందరికీ పూదేశాడు. అసలు



**చేతి పనిని ఒకదానిని నేర్చుకొనుము రేడియో అండ్ టెలివిషన్ శిక్షణ**

మెయిలికముగాను, తపాలుద్వారాను అన్ని రకములైన రేడియో, టెలివిషన్. టేప్ రికార్డర్, ఆంప్లిఫయరులను మంచి పద్ధతిలో మరమ్మతు చేయుటకును, కూర్చుటకును శిక్షణ ఇచ్చుచున్నాము.

ఏర్ కండిషనర్ అండ్ రెఫ్రిజిరేటరు.

శిక్షణ : మెయిలికముగాను, తపాలు ద్వారాను అన్ని రకములైన ఏర్ కండిషనర్, రెఫ్రిజిరేటరు, వాటరు కూలర్, డీఫ్రీసర్, కాంబినేషన్ కూలర్, పేకేజి యూనిట్ సెంట్రల్ ప్లాంట్, సేఫ్టీ ఐస్‌క్రీం మొదలగు మిషన్‌లను మరమ్మతు చేయుటకు శిక్షణ ఇచ్చుతున్నాము.

మోటారు రీవైండింగ్ అండ్ హవుస్ వైరింగ్ శిక్షణ.

అన్ని రకములైన టేబిల్‌ఫ్యాన్, సీలింగ్ ఫేన్, సింగిల్ ఫేస్, 3 ఫేస్ మోటారులను అన్యుల సహాయము లేక వైండింగ్ చేసి యంత్రింప జేయుటకును, ఆటోమేటిక్ స్టార్టర్, సెమి ఆటోమేటిక్ స్టార్టర్, రివర్స్ బైప్ స్టార్టర్, స్లిప్‌రింగ్ స్టార్టర్ లాంటి ఎలక్ట్రిక్ పరికరములను మరమ్మతు చేయుటకును, ట్రాన్స్‌ఫార్మర్ వైండింగ్ చోక్ వైండింగ్ నేర్పించుచున్నాము. హవుస్ అంత్ వైరింగ్ కోర్సు ఉన్నది. తపాలు ద్వారాను నేర్చుకొనవచ్చును. వెల్డర్, ఫిట్టర్, టర్నర్, కార్ మెకానిక్, ప్లంబర్, కార్‌పెంటర్, టైలరింగ్ మొదలగు కోర్సులును, హాస్టల్ వసతి కూడా ఉన్నది.

వివరములకు 35 పైసల స్టాంపు పంపవలెను.

**ప్రిన్సిపాలు వి. గోవిందస్వామి**

రచించిన టెక్నికల్ పుస్తకములు

1. రేడియో మెకానిజం అండ్ రిపేరింగ్ (తమిళనాడు సర్కారు వారిచే బహుమతి పొందినది)
2. ట్రాన్సిస్టరు మెకానిజం అండ్ రిపేరింగ్.
3. టెలివిషన్ మెకానిజం అండ్ రిపేరింగ్.
4. ఆంప్లిఫయరు మెకానిజం అండ్ రిపేరింగ్.
5. రెఫ్రిజిరేషన్, ఏర్ కండిషనర్ మెకానిజం అండ్ రిపేరింగ్.
6. మోటారు రీ వైండింగ్.
7. టేప్ రికార్డర్ మెకానిజం అండ్ రిపేరింగ్.

పై పుస్తకములను చదివి అన్యుల సహాయము లేక రిపేరులను సరి చేయవచ్చును. ధర వివరములకు వ్రాయుము.

వి. పి. పి. లేదు.

**GEMINI INSTITUTE OF ENGINEERING TECHNOLOGY,**

**13, UMPHERSON STREET, MADRAS-600 001.**


సంగతి ఉత్తరం చూసి కనుక్కుందా మనీ..." అర్ధోక్తిలో ఆగిపోయాడు రాజు.

"అట్లాగా...కూర్చోండి. ఉత్తరం తెస్తా" అని లోపలికి వెళ్ళి కృష్ణుడి పటం వెనక ఉంచిన ఉత్తరాన్ని తెచ్చి రాజు చేతి కిచ్చాడు. ఇన్‌లాండ్ కవరు తెరిచి అందరూ వినేటట్టుగా పైకి చదివాడు రాజు.

"ప్రియమైన నాన్నగారికి కుమారుడు కుమారస్వామి నమస్కరించి వ్రాయుట. ఈ అయిదు సంవత్సరాల నుండి ఇంటికి ఎప్పుడు వద్దామా, మన వూరి పరిసరాలు ఎప్పుడు చూద్దామా అనే తహతహ ఎంతగానో ఉన్నది. కాని నా జీవిత ధ్యేయం పూర్తి అయ్యేవరకు రాకూడదనే దీక్షతో ఇక్కడే ఉన్న సంగతి మీకు తెలుసు నాన్నా! నేను ఎమ్. ఎ. పరీక్షలు బాగా రాశాను. తప్పకుండా క్లాసు వస్తుంది.

ఇక్కడ నన్ను కంటికి రెప్పలా చూసు కుంటున్న శ్రీ వేంకటేశ్వరరావుగారు క్షేమంగా ఉన్నారు. మిమ్మల్ని అడిగినట్లు వ్రాయమన్నారు. వారి ప్రోత్సాహం మీ ఆశీస్సులు నన్ను ఇంతవాణ్ణి చేశాయి.

రాయుడు, రాజు, దాసు, రత్నం, రవి, ఇంకా తదితర మిత్రుల్ని చూడాలని ఎంతగానో ఉబలాటపడుతున్నాను. వారికి నేను వచ్చే సంగతి చెప్పగలరు.

రేపు ఎక్స్‌ప్రెస్‌కు వస్తున్నాను. నేను ఇంటికి వచ్చేటప్పటికి 11—12 గంటలు అవుతుంది. విశేషాలు వచ్చిన తరవాత.

ఇట్లు, నమస్కారాలతో...

—కుమారస్వామి."

"అంటే—ఇంకో మూడు గంటల్లో వస్తాడన్న మాట. మనంకూడా రెడీ అయి పింతలతోపు దగ్గర స్వాగతం ఇద్దాం. మన వూళ్ళో ఎమ్. ఎ. చదివిన మొనగాడికి అంత గౌరవం ఇవ్వకపోతే ఎలా? ఏమంటారు?" అన్నాడు రాజు.

"గొప్ప ఐడియారా! అట్లాగే చేద్దాం. పరంధామయ్య తోటలో పూలుంటాయేమో చూడరా, దాసూ. ఒక దండ కట్టించి, మన స్వామి మెడలో నేద్దాం. పదండి మరి" అన్నాడు రత్నం. కొందరు కదలి వెళ్ళారు.

రాజు ఉత్తరం ఇవ్వడానికి శివయ్య వైపు తిరిగితే, శివయ్య కండువాతో కళ్ళు తుడుచుకుంటున్నాడు.

"మీరు అదృష్టవంతు లండీ. మీ కష్టాలు కడతేరతాయి. ఒరే, రాయుడూ. నా కొక పందుంపుల్ల అందుకోరా. పూరునుంచి ఇటే వచ్చా. ఇంకా మొహం కడుక్కోలేదు" అన్నాడు.

రాయుడు ఒక ఈతపుల్లను చేతిలో పెట్టకుండా జేబులో పెట్టాడు.

"రాయుడూ! నాకూ ఒక పందుం పుల్ల తెచ్చి పెట్టు, బాబూ" అన్నాడు శివయ్య.

"ఏమిటీ. మీరింకా ముఖం కడుక్కోలేదన్న మాట. ఇదుగో—ఈ పుల్ల తీసుకోండి" అన్నాడు ఇవ్వబోతూ.

"ఒరే, రాజూ! మా మామయ్య ఈతపుల్లతో కడగడం మానేసి అయిదేళ్ళయిందనుకుంటానురా. నేను వేపపుల్ల గాని, తుమ్మపుల్ల గాని తెచ్చి పెడతాను. నువ్వు పద" అన్నాడు.

"ఆహా... అట్లాగా" అని "ఇక నేను వెళ్ళుతున్నా నండీ" అని శివయ్యతో చెప్పి వెళ్ళిపోయాడు.

రాయుడు లేవనెత్తిన ఈతపుల్ల ప్రస్తావన రాగానే శివయ్యకు గుండెలో గునపంతో పొడిచి నట్లైంది. అతని చేతులు వణికి పోయాయి. ఏ నాటిదో ఒక భయానకమైన స్మృతి మనస్సును 'చెళ్ చెళ్' మని బాది నట్లనిపించింది. అతను కన్నులు మూసుకున్నాడు. కళ్ళలో నుండి కన్నీళ్ళు అవిరళంగా స్రవిస్తున్నాయి.

"ఏమిటి, మామయ్యా! శుభమా అని బావ వస్తుంటే కన్నీరెందుకు? ఇదుగో వేపపుల్ల. ఈ రోజు నిన్ను, బావని మా ఇంటికే భోజనానికి తీసుకుని రమ్మంది మా అమ్మ. తొరగా తయారు కా. పది గంట లయినట్టుగా ఉంది" అని పరుగెత్తుకొని వెళ్ళాడు రాయుడు, శివయ్య చెల్లెలి కొడుకు.

చూరు కింద కూర్చుని పళ్ళు తోముకుంటుంటే గతించిన సంఘటనలు గుండెని తొలుస్తున్నవి.

ఇద్దరు పిల్లల్ని తన ఎదాన కొట్టి భార్య పార్వతి చనిపోయింది. పిల్లల కోసం తన సుఖం పణం పెట్టుకుని, పెళ్ళి మాటను జీవితంలో నుండి నెట్టి వేశాడు. తల్లి లేని పిల్లల్ని అబ్బురంగా పెంచాడు. పిల్లకి పెళ్ళి చేసి అత్త వారింటికి పంపాడు. ఆ కూతురు సుమతి తన్ను తనుకూడా చేసింది. ఇక రెండవ వాడు స్వామి. స్వామి పల్లె వాతావరణంలో ఏమవుతాడో అని భయపడితే అనుకున్నట్లే చేశాడు. ఇంటర్ మీడియట్ పరీక్ష ఒక్క మార్కులో డింకీ కొట్టాడు. కొడుకు అపజయం తన జీవితానికి కళంకం. సంతానం కోసం తన సౌఖ్యాన్ని కాలదన్నుకుంటే, కొడుకు తన ఆశయాల్ని కూలదన్నడం కృతఘ్నం కాని నిర్లక్ష్యం! తాను నిర్లక్ష్యాన్ని సహించడు. దానికి తగిన ఫలితం ఎవరైనా పొంది తీరాల్సిందే!

ఆ నాడు ఘనకంలా వచ్చిన కోపా

వేశంతో తన్ను తాను మరిచి పోయాడు. ఆ దుర్భర సన్నివేశం ఈ నాటికీ ఇంకా గుండెలో పచ్చి గాయమై కలుక్కు మంటున్నది. ఇప్పుడు ఆ భావన తనను పీక్కుని తింటున్నది. ఆ నాడు కర్కశంగా ప్రవర్తించిన ఆ చేతులే ఈ చేతులు! వీటికి శిక్ష లేదా?

పార్వతి ఉంటే?...ఆ నాడే ఉంటే ఆ సంఘటన జరిగేది కాదేమో! ఈ నాడు గనక ఉంటే ఎంత ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయేదో? ఆమె వెళ్ళి పోయింది, ఏ బాదర బందీ లేకుండా. తాను కన్న సంతానాన్ని కన్ను మిన్ను కానకుండా దండించి, ఎదురైన రోజుల్ని తలుచుకుని తల్లకిందు లవుతున్నాడు.

జనం అటూ ఇటూ తిరుగుతున్నారు. శివయ్య తన మానసిక ప్రపంచంలో కూరుకుని పోయాడు. సమయం గడుస్తున్న కొద్దీ మంగలంలో వేగుతున్న జొన్నవిత్తు అయిపోతున్నాడు.

"మా... మయ్యా! వూ... ఉహు. ఇంకా కాలేదా? ఏంటీ రోజు మరీ అదోలా ఉన్నావ్? తోపు దగ్గరకు వెళ్ళ బోతున్నా. నువ్వు కానియ్య" అని రాయుడు అన్న మాటలకు ఈ లోకం లోకి వచ్చాడు.

"ఆఁ—ఇదుగోరా. అయిపోయిందిలే" అని లేచాడు. ఉషారుగా వెళ్ళుతున్న మేనల్లుడిని చూస్తూ లోలోన నవ్వు కున్నాడు.

గుండెలోని నిట్టూర్పు ల్లాగా గాలి హోరు మంటున్నది. ఇళ్ళమీద తాటాకులు శబ్దం చేస్తున్నవి. ఇంటి ముందున్న బాడితె చెట్ల ఆకులు రాలుతున్నవి. వాటి పువ్వులు నవ్వుతున్న ఎర్రని పెదాల్లాగా కనపడుతున్నవి.

శివయ్య ముఖం తుడుచుకుని ఇంట్లోకి వెళ్ళి ఒక విక్కి తీసుకుని తానుకూడా తోపు వైపు బయలు దేరాడు. ఆ తోపు వూరికి దాదాపు మైలున్నర దూరంగా ఉంటుంది. వెళ్ళుతున్న శివయ్యను జనం గౌరవ పూర్వకంగా చూస్తున్న విషయం అతను గమనిస్తూనే ఉన్నాడు.

ఎండ క్రమంగా తీవ్రమవుతున్నది. ఎర్రదుమ్ము రోడ్డుమీద నడుస్తున్నాడు శివయ్య. కంపలు, గుట్టలు, పొదలు ఎర్రదుమ్ముతో రంగు మారిపోయి ఉన్నాయి. చింతలతోపు ఇంకా ఒకఫర్లాంగు దూరంలోనే ఉంది. ఆ చెట్ల నీడన దాదాపు ఏడెనిమిది మంది తన కొడుక్కి స్వాగతం చెప్పడంకోసం ప్రతీక్షిస్తున్నారు. ఎంత మధురానుభూతి అది!

అయితే అక్కడకు వెళ్ళడానికి శివయ్య కాళ్ళు సమ్మెచేశాయి. మనస్సులో ఒక పక్క ఉద్వేగం! మరొక పక్క ఒక విధమైన బెరుకుతనం!

అక్కడే గంగరావి చెట్టు క్రింద కూలబడ్డాడు. ఎదురుగా ఈత పొదలు కదులుతున్నాయి. ఈత ఆకులు కదులు తుంటే శివయ్యను ఎగతాళి చేస్తున్నట్లు అనిపిస్తున్నది. తన చేతుల్ని చూసు కొన్నాడు. చేతులు వణుకుతున్నవి.

దూరంగా సందడి! కోలాహలం! సంతోషాతిరేకం! లేచి నిలబడ్డాడు శివయ్య. రిక్షాలో వస్తున్న కుమార స్వామిని అందరూ చుట్టు ముట్టారు. మెడపో దండలు వేశారు. చేతులపైన ఎక్కించుకొన్నారు. కౌగిలించుకొన్నారు.

శివయ్య తదేకంగా చూశాడు. ఆ దృశ్యం అతనికి గుండెలో పండుగ చేసింది. ఎండ వెండి వెన్నెలలా అనిపించింది. అతనిలో రక్తం ఉప్పొంగుతున్నది. చేతులు వణుకుతున్నవి.

క్రింద ఉంచిన విక్కిని తీసుకొన్నాడు. ఈత పొదల దగ్గరకు వెళ్ళాడు. తొందరగా విక్కితో పది ఈత మట్టల్ని కోశాడు. ఆకుల్ని దూశాడు. ఆ పది సువ్వల్ని తీసుకొనివచ్చి గంగరావి చెట్టు క్రింద పడవేశాడు. ఒక్కో సువ్వను ఎడమచేత్తో తీసుకొని "టాప్ టాప్" అని కుడి చేతిని కొట్టుకొన్నాడు. ఆ వణుకుతున్న కుడి చేత్తో ఎడమ చేతిని కొట్టుకొన్నాడు. ఆ పది సువ్వలు ముక్కలై విరిగిపోయాయి. చేతులు చిట్లాయి. రక్తం కారుతున్నది. మనస్సులోని ఉద్వేగం ఉపశమించింది.

పది నిమిషాలైంది. కుర్రవాళ్ళు కేరింతలు కొడుతూ వస్తున్నారు. రోడ్డు మూల తిరిగారు. గంగరావి చెట్టు దగ్గరకు వచ్చారు. అక్కడ కూర్చున్న శివయ్యను చూసి నిశ్చేష్టులై పోయారు. లేచి నుంచొని కొడుకును కన్నులార చూసి, రెండడుగులు ముందుకు వేశాడు శివయ్య. పరుగున వచ్చి కుమార స్వామి తండ్రిని కౌగిలించుకొన్నాడు. ఇద్దరి కన్నుల్లోనుండి కన్నీటి ధారలు ఎడతెగకుండా స్రవిస్తున్నవి. ఒక నిమిషం అయిన తర్వాత ఆ ప్రదేశం చూస్తే ముక్కలైన ఈత సువ్వలు కుమారస్వామికి కనబడ్డాయి. అతను తండ్రి చేతుల్ని తీసుకొని పరికిస్తే రక్తసిక్తమై పగిలిన హస్తాలు!

"నాన్నా! ఏమిటిది?"

"ఏముంది? నన్ను నేను శిక్షించుకొన్నాను, బాబూ. అయిదు సంవత్సరాల క్రిందట తొందరపడి, ఆవేశంతో నిన్ను ఈత సువ్వలతో బాదినందుకు నేను క్రుంగిపోతున్నా. ఈ చేతులతో నిన్ను, నీ అక్కని మోశాను, పెంచాను. అటువంటి ఈ చేతులతోనే నిన్ను కొట్టినందుకు నిలవలేకపోతున్నా. నువ్వు ఎంతో బాగా చదివి, ప్రయోజకుడిగానా ఎదట పడితే, నన్ను బెదరించే గుండెలో నీ ఎదుట పడలేకపోయాను. అందుకని నిన్ను కొట్టిన సువ్వలతో నా చేతుల్ని కొట్టుకొని మనస్సును తేలిక చేసుకొన్నాను బాబూ...ఇప్పుడు నాకు ఎంతో హాయిగా ఉంది" అని కొడుకు చేతుల్ని ముద్దు పెట్టుకొన్నాడు.

"అయ్యో! ఎంత పని చేశావు నాన్నా! నన్ను దండించడం నీ అపరాధం కాదే? అది నీ ధర్మం, నీ కర్తవ్యం. అప్పుడు ఒక్క మార్కు తగ్గి ఫెయిల్ అయినందుకు కొట్టావు గాని, అనవసరంగా శిక్షించలేదే? నువ్వు నన్ను దండించకపోతే నాలో ఇంత దీక్ష కల్గేదా? నీ వ్యథ అర్థమయ్యేదా? ఇంకా జీవితం అర్థమయ్యేదేనా? ఇంతదాకా వచ్చేవాణ్ణా? కన్న సంతానాన్ని మందలించకుండా, కనీసం పల్లెత్తు మాట కూడా అనలేని తల్లితండ్రులు వాళ్ళ కళ్ళ ముందే, ఆ పిల్లలు భ్రష్టులై, జడుద్దాయిలై చరిత్ర హీనులై బలాదూరు తిరుగుతుంటే కిమ్మనకుండా మౌనం చిత్తగిస్తుంటే, నా బాగు కోసం, నా భవిష్యత్తు కోసం నన్ను శిక్షించినందుకు బాధ పడుతున్నావా నాన్నా? అయితే తలిదండ్రులు పిల్లల్ని రాచి రంపాన పెట్టి పెంచాలని నేను కోరడం లేదు. ప్రేమించాలి—అవసరం వస్తే అంత కన్నా ఎక్కువగా శిక్షించాలి. అది వాళ్ళ మమతను బంధించే ముడి అవుతుంది.

నేను గ్రహించిన పరమ సత్యం ఏమంటే మాటలతో, బెదిరించకుండా అవసరం కలిగినప్పుడు దండించని తండ్రి సంతానానికి శత్రువే! బాధ్యత తెలియని మనిషే! కాబట్టి ఈ నీ చేతులు నా భవితవ్యాన్ని తీర్చి దిద్దిన అమృత హస్తాలు, నాన్నా...అమృత హస్తాలు!" అని కుమారస్వామి కన్నీటితో ఎర్ర తామరల్లా ఉన్న తండ్రి చేతుల్ని కన్నులకు అద్దుకొన్నాడు, ముద్దు పెట్టుకొన్నాడు.

చూస్తున్న కుర్రవాళ్ళు ఆశ్చర్యానికి అవధి లేదు. వాళ్ళ కన్నుల్లో నీటి తెరలు కదలాడాయి.

సూర్యుణ్ణి మబ్బు కప్పేసింది. చల్లని గాలి వీచింది. గంగరావి చెట్టు పచ్చని పువ్వులు రాల్చింది. ఈత పొదలు పరమానందంతో శిరః కంపం చేశాయి. ★


## ఇంటి సినిమా యంత్రం

**(SILENT MOVIE)**

**ధర రూ. 150**



సినిమా ఫిలిం రీళ్ళు కూడా మా వద్ద లభ్యమౌతాయి. ప్రొజెక్టర్ మరియు సినిమా ఫిలిం ధరల జాబితాకు సమగ్ర కేటలాగ్ పుస్తకానికిగాను రూ. 2-50 కు పోస్టేజి స్టాంపులు పంపండి. ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

**ఉత్పత్తి దారులు :**

**FILM COMPANY**

**(Established 1967)**
**Post Box No. 269**
**3, Thillaichidambara Nadar Street,**
**SIVAKASI-626123 Tamilnadu.**